సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
8-7-2023 శనివారం
వెల: ₹ 5.50



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

# దేశ జీడీపీలో మత్స్య ఉత్పత్తులే కీలకం

## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు




జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
చిత్రంలో మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి, కలెక్టర్ రాజాబాబు తదితరులు

మచిలీపట్నంటౌన్: భారతదేశ జీడీపీలో మత్స్య ఉత్పత్తులే ప్రధానభూమిక పోషిస్తున్నాయని దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని కేంద్ర భూవిజ్ఞాన శాస్త్ర మంత్రిత్వశాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సముద్ర సమాచార వ్యవస్థల జాతీయ కేంద్రం ఆధ్వర్యంలో సముద్ర సమాచారం, సలహా సేవలపై అవగాహన సదస్సు శుక్రవారం మచిలీపట్నంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కిరణ్‌రిజిజు మాట్లాడారు. సముద్ర సమాచార వ్యవస్థల జాతీయ కేంద్రం హైదరాబాద్ సంస్థ మత్స్యకారులు చేపలవేటకు నిరంతరం సహకారం అందిస్తుందని చెప్పారు. సునామీ తదితర ప్రకృతి విపత్తుల విషయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుందని తెలిపారు. సముద్రంలో చేపలు పుష్కలంగా ఏ ప్రాంతంలో దొరికేదీ గుర్తించి మత్స్యకారులకు తెలియజేస్తాయని పేర్కొన్నారు. సముద్రంలో ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే హెచ్చరించటం వంటి బృహత్తర సమాచారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమాచారాన్ని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఇన్కాయిస్) సంస్థ విడుదల చేస్తుందని వెల్లడించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భారతదేశ తూర్పు, పశ్చిమ తీరాల్లో నిర్వహించతలపెట్టిన ఐదు వర్క్‌షాప్‌లలో మొదటిది మచిలీపట్నంలోనే నిర్వహించామని వివరించారు.

**జగన్, మోడీ జోడితో అభివృద్ధి..**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేశ ప్రధాని నరేంద్రమోడీ జోడితో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో కేవలం రూ. 4 వేలు మాత్రమే ఇచ్చిన వేట నిషేధ భృతిని సీఎం జగన్ రూ. 10 వేలకు పెంచి అందజేస్తున్నారని చెప్పారు. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మచిలీపట్నంలో ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

**రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి..**

ఆధునిక టెక్నాలజీ మత్స్యకారులకు అందించే ముఖ్య ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమం మొదటిసారిగా మచిలీపట్నంలో ఏర్పాటు చేశామని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మచిలీపట్నంలో రీజనల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజును ఆయన కోరారు. ఎంపీ నిధులు, సీఎస్ఆర్ నిధులతో ఆధునిక బోట్లు తయారు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీఎన్ హరిహరణ్, ఇన్కాయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాసకుమార్, భూవిజ్ఞానశాస్త్రం మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ సెంథిల్ పాండియన్ పాల్గొని మత్స్యకారులకు అందించే సేవల గురించి వివరించారు. తొలుత ఇన్కాయిస్ సంస్థ సముద్ర సమాచార వ్యవస్థలో వినియోగించే పరికరాల ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. కొచ్చిన్ ఫిష్ యార్డు ప్రతినిధి డీప్ సీ ఫిషింగ్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. మత్స్యకారులకు కేంద్ర మంత్రి జెమినీ డివైజ్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి, మత్స్యసహకార సంఘాల ప్రతినిధులు చింతా గోవిందరాజులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, మత్స్యకారులు పాల్గొన్నారు.